క్లుప్తంగా

ఆయన మృతి పార్టీకి తీరని లోటు



విశ్వనాథ నాయుడు మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొంపిచెర్ల: వడ్డమూడి విశ్వనాథ నాయుడు మృతి చెందడం తమ పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మండలంలోని సవ్వావాండ్లపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు విశ్వనాథరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం పార్టీ నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డిశ్వర్ రెడ్డి, నాయకులు విజయశేఖర్, పెద్దిరెడ్డి దేవేంద్ర రెడ్డి, నాగిరెడ్డి, సురేంద్ర నాయుడు, శ్రీనాధనాయుడు, కరీముల్లా, మునికృష్ణారెడ్డి, నాగిశెట్టి రెడ్డెన్న, వెంకటరమణ నాయుడు, జగన్‌మోహన్ రెడ్డి, మేకల హరినాధ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ



రైతులకు శిక్షణ ఇస్తున్న వీఏఏ అనిల్ కుమార్

పెద్దపంజాణి: మండలంలోని చలమంగలం రైతు సేవా కేంద్రంలో వీఏఏ అనిల్ కుమార్ సోమవారం రైతులకు డిజిటల్ నైపుణ్యాల అభివృద్ధిపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్మార్ట్ ఫోన్ ఆధారిత వ్యవసాయ సమాచారం, యూపీఐ లావాదేవీలు, ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్‌ల వాడకం, వాతావరణ సమాచారంతో పాటు మార్కెట్ ధరలు తెలుసుకోవడం, ప్లాంటిక్స్, అగ్రి సెంట్రల్ వంటి వ్యవసాయానికి ఉపయోగపడే వివిధ యాప్‌లపై శిక్షణ ఇచ్చినట్లు ఆయన చెప్పారు. రైతులు డిజిటల్ పరిజ్ఞానంతో వ్యవసాయ పనులను మరింత సమర్థవంతంగా మార్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి దీప, వీఏఏ మోహసిన పాల్గొన్నారు.

బైకులు ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడ్డ అప్పినాయక్

సదుం: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం..ఓ ఫ్యాక్టరీలో ఒడిశాకు చెందిన అప్పి నాయక్, దీపు కూలీలుగా పని చేస్తున్నారు. వారు ద్విచక్రవాహనంలో వస్తూ కలికిరి మార్గంలో రామమందిరం సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనాన్ని అదుపు తప్పి ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 అంబులెన్స్‌లో పీలేరుకు తరలించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రిమాండ్

శాంతిపురం: మద్యం సేవించి ద్విచక్ర వాహనాన్ని నడిపిన కేసులో నిందితుడికి కుప్పం కోర్టు మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించినట్టు రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ తెలిపారు. ఎస్సై కథనం.. సోమవారం రాళ్లబూదుగూరులో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. బైకుపై వచ్చిన గుంజార్లపల్లెకు మురళీమోహన్(31)ని అదుపులోకి తీసుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయడంతో అతడు మద్యం సేవించి ఉన్నట్టు నిర్ధారణ కావడంతో అరెస్ట్ చేశారు. అతడిని కుప్పం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ పి.వరుణ్ ముందు హాజరు పరచారు. న్యాయమూర్తి రూ.2వేలు జరిమానా విధించినా చెల్లించకపోవడంతో రిమాండ్‌కు తరలించారు.

పూతలపట్టులో దొంగలు పడ్డారు

పూతలపట్టు (కాణిపాకం): పూతలపట్టు మండలం ఆదివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. తాళం వేసిన ఇళ్లల్లో చోరీ చేశారు. బైక్‌పైకి వచ్చిన దొంగలు మండల కేంద్రంలోని చిన్నస్వామి నాయుడు, జయరామనాయుడి ఇంట్లో ఆభరణాలను ఎత్తుకెళ్లిపోయారు. సుమారు 250 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి చోరీ చేసినట్లు ఫిర్యాదు చేశారని సీఐ కృష్ణమోహన్ తెలిపారు.

కిశోరి వికాసంపై అవగాహన

బంగారుపాళెం: యుక్తవయసులో ఉన్న బాలికల భవిష్యత్‌కు కిశోరి వికాసం దోహదపడుతుందని ఎంఎల్‌హెచ్‌పి ఢిల్లీ అన్నారు. మండలంలోని తగ్గువారిపల్లెలో సోమవారం కిశోరి బాలికలకు అవగాహన కల్పించారు. బాలికల్లో కౌమార దశలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలను, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. లైంగిక వేధింపుల నుంచి రక్షణ, ఆత్మరక్షణ, వృత్తి, విద్య, ఉపాధి అంశాలపై అవగాహన కల్పించారు.

రైతులను ముంచేసిన క్యాబేజి..!

- ప్రస్తుతం టన్ను ధర రూ.వెయ్యి మాత్రమే!
- కొనుగోలుకు రాని వ్యాపారులు
- తోటల్లోనే పంటను వదిలేస్తున్న రైతులు
- ఎకరాకు రూ.50వేల వరకూ నష్టం



రామాపురం వద్ద సాగుచేసిన క్యాబేజిని అమ్మకానికి సిద్ధం చేసి వేచి చూస్తున్న రైతు



పది టన్నుల క్యాబేజిని 10వేలకు అమ్ముతున్న రైతు

పలమనేరు: గత మూడేళ్లుగా క్యాబేజి సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధరలేక మళ్లీ నష్టపోయారు. ఈ సారైనా మంచి రేటు పలికి తమ రాత మారుతుందనే ఆశతో మళ్లీ ఇదే పంట సాగు చేశారు. తీరా గత పదేళ్లలో ఎన్నడూ లేనంతగా ధరలు పతనమై నిండా మునిగిపోయారు. క్యాబేజీ కిలో రూపాయి కూడా పలకడం లేదు. ధరలున్నప్పుడు తోటల వద్దకే వచ్చి కొనే వ్యాపారులు ఇప్పుడు ముఖం చాటేయడంతో రైతులు పొలంలోనే పంటను వదిలేస్తున్నారు.

ఆశలు అడియాశలై..!

పలమనేరు ప్రాంతం శీతల వాతావరణాన్ని కలిగి ఉంటుంది. ఇదే వాతారణం పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లాలోనూ ఉంది. దీంతో అక్కడి రైతులు పండించే పలు కూరగాయలను ఇక్కడి రైతులు కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడి రైతులు ఈ సీజన్‌లో 600 హెక్టార్లలో ఇక్కడ క్యాబేజీ సాగుచేశారు. ఇక్కడి ఎర్ర నేలలో దిగుబడి బాగా వస్తుండడంతో రైతులు దీనిపై ఆసక్తి చూపారు. ఎకరా పొలానికి 20వేల మొక్కలను నాటారు. మొక్క రూ.50 పైసల నుంచి రూపాయి వరకూ కర్ణాటకలోని నర్సరీల నుంచి తెచ్చారు. దీని పంటకాలం కేవలం 90 రోజులు మాత్రమే. మంచిగా పంట పండితే ఎకరానికి 30 టన్నుల దాకా దిగుబడి వస్తుంది. అయితే కొన్నాళ్లుగా క్యాబేజికి ధరలు అమాంతం పడిపోయాయి. గత నెలలో ఆశాజనకంగా ఉన్న టన్ను ధర ఇప్పుడు కేవలం వెయ్యి రూపాయలకే పడిపోవడంతో పెట్టుబడి సైతం దక్కని పరిస్థితి రైతులను దిక్కుతోచడం లేదు.

అడిగే దిక్కే లేదు

గతంలో క్యాబేజి సాగు చేసిన రైతుల పంటలను వ్యాపారులు తోటల వద్దే కొనేవారు. ముఖ్యంగా ఛత్తీస్‌ఘడ్, రాయపూర్, భువనేశ్వర్, కటక్ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కూలీలతోపాటు వచ్చి రైతుల పొలాలవద్దే క్యాబేజీ లోడుతో వెళ్లేవారు కానీ ఇప్పుడు ధర పతనం కావడంతో బయటి వ్యాపారులు రావడం లేదు. స్థానిక మార్కెట్‌లో దీన్ని కొనేవాళ్ళు లేకుండా పోయారు. దీంతో ఈ దఫా క్యాబేజి రైతులు పంటను చేలల్లోనే వదిలేశారు.

ఇంత దారుణంగా ఎప్పుడూ లేదు



నేను క్యాబేజి నాలుగేళ్ల నుంచి సాగుచేస్తున్నా. గతంలో ఎప్పుడూ ఇంతటి తక్కువ ధర నేను చూడలేదు. కిలో రూపాయికి సైతం కొనలేదంటే మాలాంటి రైతులు ఏమికావాలి? పంట సాగు కోసం రూ.50 వేల నుంచి రూ.70వేల దాకా ఖర్చు పెట్టాం. ఇప్పుడు చూస్తే కనీసం పెట్టుబడిలో పదోవంతు కూడా దక్కడం లేదు. కనీసం కొనే వ్యాపారులు లేరు. దీంతో పంటను అలాగే వదిలేశాం.

–హరి, రైతు, రామాపురం, పలమనేరు మండలం

నోటీస్ బోర్డు

- **నేడు వ్యవసాయ పనిముట్లు పంపిణీ**

శాంతిపురం: మండలంలోని 24 మంది రైతులకు రూ.15 లక్షల విలువైన వ్యవసాయ పనిముట్లను రాయితీపై మంగళవారం ఉదయం 11 గంటలకు తమ కార్యాలయంలో పంపిణీ చేయనున్నట్టు మండల వ్యవసాయాధికారి అప్పోజి తెలిపారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



శాస్త్రీయ నృత్యం చేస్తున్న బాలికలు

పలమనేరు: పట్టణంలో తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా ఐదోరోజైన సోమవారం స్థానిక గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణానికి చెందిన వన్నెకుల క్షత్రియ, టౌన్ టెంపో ట్రావెలర్స్ ఆధ్వర్యంలో పూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తిరుపతి గంగమ్మ జాతర చాటింపు నేడు



శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయం



కొనుగోలు చేసినా భవనాలను కూల్చివేస్తున్న దృశ్యం

కుప్పం: కుప్పంలో ప్రతి ఏటా ఎంతో ఘనంగా నిర్వహించే శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవాలయం జాతరకు మంగళవారం చాటింపుతో శ్రీకారం చుట్టనున్నారు. 15 రోజుల పాటు నిర్వహించే ఈ జాతరకు సంబంధించి ఆలయ ప్రాంగణాన్ని పచ్చటి తోరణాలతో అలంకరించారు. తొలుత మంగళవారం ఉదయం గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి, అంకురార్పణ, ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అంబలి పంపిణీ చేస్తారు. ఆ తరువాత సాంప్రదాయానుసారం అర్ధరాత్రి పట్టణ సరిహద్దులో పూజలు చేసి చాటింపు పూర్తి చేస్తారు. 14 వినాయకస్వామి ఉత్సవ ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభవుతాయి. అప్పటివరకు ఆలయంలో నిత్యపూజలు జరుగుతాయి.ఈ ఉత్సవాలలో భాగంగా 19వ తేదీ ప్రసన్న ముత్తుమారెమ్మ అగ్నిగుండ ప్రవేశం, పుష్పపల్లకి, పచ్చగెరిగ, బాణసంచా వేడుకలు, 21న ప్రసన్న తిరుపతి గంగమ్మ కళ్లకు తెర తొలగించి శిరస్సు ఊరేగింపు నిర్వహిస్తారు. జాతరలో చివరి రోజు అమ్మవారి విశ్వరూప దర్శనంతో పరిసమాప్తమవుతాయి.

అగ్నిగుండ ప్రవేశం, పొంగళ్ల స్థల సమస్య పరిష్కారం

జాతర సందర్భంగా భక్తులు 15 రోజులు పాటు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లిస్తారు. ప్రధానంగా ఇక్కడ అగ్నిగుండ ప్రవేశానికి స్థలం లేక ఇబ్బందులు పడేవారు. కొన్నేళ్లుగా రోడ్డుపైనా, ఆలయ ప్రాంగణంలో ఇబ్బందుల నడుమ పొంగళ్లు పెట్టేవారు. ప్రస్తుతం ఆలయం ఎదురుగా 39 సెంట్ల భూమిని గతంలో ప్రభుత్వం కేటాయించింది. కానీ ఈ స్థలానికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో పాలక మండలి దీనిపై దృష్టి సారించింది. ఈ ఏడాది ఆలయ శాఖ అధికారులు, ఆలయ చైర్మన్ రవిచంద్ర పొంగళ్లు పెట్టే స్థలానికి వెళ్లే దారి కోసం ఆలయానికి ఎదురుగా ఉన్నా రెండు భవనాలను రూ.87 లక్షలకు కొనుగోలు చేశారు. దీనిని తొలగింపు పనులు చేస్తున్నారు. పట్టణంలో పలువురు దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. దశాబ్దాలుగా పీడిస్తున్న స్థల సమస్య పరిష్కారం కావడంతో పట్టణ ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెద్దశేష వాహనంపై కోనేటిరాయుని విహారం

- వేడుకగా తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం



వేడుకగా ఆలయ ధ్వజారోహణం



పెద్దశేష వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడు

గంగవరం: మండలంలోని టీడీపీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సోమవారం ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, తోమాలసేవ, హోమాలు, తిరుచ్చి ఉత్సవం, తదితర కార్యక్రమాలను ఆగమోక్తంగా నిర్వహించారు. యాగశాలలో పూజలు చేసి ధ్వజపటాన్ని, చక్రత్తాళ్వారును, శ్రీదేవి భూదేవి సమేతంగా కోనేటిరాయస్వామిని తిరుచ్చిపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ ఘట్టాన్ని కంకణ బట్టార్ ఏకే. నరసింహాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు గ్రామ పొలిమేరలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. రాత్రి పెద్దశేష వాహనంపై స్వామివారు సర్వాలంకార భూషితుడై శ్రీదేవి భూదేవి సమేతంగా మాడవీధుల్లో విహరించారు. కోలాటాలు, భజన బృందాల నడుమ వాహన సేవ కొనసాగింది. వాహన సేవ అనంతరం స్వామివారు తిరిగి ఆస్థాన మండపానికి చేరుకున్నారు. కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటి ఈఓ వరలక్ష్మి, సూపరిండెంట్ రాజకుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, ఆలయ అర్చకులు దేవరాజాచార్యులు, శ్రీహర్షదీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు

మంగళవారం ఉదయం చిన్నశేష వాహనం, రాత్రికి హంస వాహన సేవ నిర్వహిస్తున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

యథేచ్ఛగా చింతచెట్ల నరికివేత

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- ముడుపుల వ్యవహారంతోనే సాగుతున్న దందా..?
- 'వాల్టా' చట్టానికి తూట్లు



యల్లంపల్లె వద్ద నరికివేతకుకు గురైన చింతచెట్లు

చౌడేపల్లె: మండలంలోని కాగతి పంచాయతీ యల్లంపల్లె సమీపంలో యథేచ్ఛగా చింతచెట్లు నరికివేస్తున్నా రెవెన్యూ, అటవీశాఖ అధికారులు నోరు మెదపడం లేదు. మొన్నటివరకు ఇటుకల బట్టీలకు అటవీ కలపను, తరలిస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు మూటకట్టుకున్నారు. ఇప్పుడు ఏళ్ల నాటి భారీ వృక్షాలను నరికేస్తున్నా దృష్టి సారించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ శాఖ అధికారులు ముడుపులు తీసుకొని అక్రమ కలప వ్యాపారానికి సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కాగతి సచివాలయానికి కూతవేటు దూరంలోని యల్లంపల్లెకు సమీపంలో సుమారు 40 చింతచెట్లు నరికేశారు. చెట్లు నరికివేయడంతో చింత తోపు కళావిహీనంగా మారింది. వాల్టా చట్టానికి ఇక్కడ తూట్లు పొడుస్తున్నారు. ఉన్నతాధికారులు మాత్రం పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి..సంరక్షించండి..అని ఓ వైపు ఊదరగొడుతున్నా కిందస్థాయి అధికారులు వృక్ష సంహారానికి తమవంతు సహకారం ఇస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులైనా అక్రమార్కుల అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు, సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాల పంపిణీ



రైతులకు పరికరాలు పంపిణీ చేస్తున్న ఏఓ

గుడుపల్లె: రైతులకు వ్యవసాయ పరికరాలను 50 శాతం రాయితీతో పంపిణీ చేశారు. సోమవారం స్థానిక మండల రైతు సేవా కేంద్రం వద్ద బ్యాటరీ,స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, 9 మడకలు, 5 మడకలు, రోటావేటర్లను వ్యవసాయశాఖ అధికారి నాగరాజు రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, పంటలలో తక్కువ ఖర్చుతో కలుపు తీయడం, కూలీల ఖర్చు ఆదా చేసుకునేందుకు వ్యవసాయ పరికరాలు ఉపయోగపడుతాయని, కావాలసిన రైతులు ఆయా గ్రామాలలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు టీఎం. బాబు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలను నిర్వహిస్తున్న పలమనేరు హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు

పలమనేరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన యాభై ఏళ్ల అనాథ వ్యక్తికి పట్టణానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు సోమవారం స్థానిక హిందూ శ్మశాన వాటిలో అంత్యక్రియలను నిర్వహించారు. ఈనెల 2న ఆస్పత్రిలో అతను చేరాడు. ఆదివారం మృతి చెందాడు. మృతుడి సంబంధీకులెవరూ రాకపోవడంతో పోలీసులు మున్సిపాలిటీకి మృతదేహాన్ని అప్పగించారు. ఇది తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగశివ, శక్తి, ప్రసాద్, యువరాజ్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీ: ఇద్దరికి గాయాలు

సదుం: మోటార్ సైక్లిస్టులు గాయపడానికి కారణమైన కారుపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ షేక్‌షావలి సోమవారం తెలిపారు. ఆయన కథనం..కురవపల్లెకు చెందిన దేవేంద్ర కారులో వెళ్తూ కంభంవారిపల్లె మార్గంలో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో సోమల మండలం ఎగువగొల్లపల్లెకి చెందిన మోటార్‌సైక్లిస్టులు సుబ్రమణ్యం, హరిబాబు గాయపడ్డాడు. హరిబాబు అక్క సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

13న వాహనాల వేలం

తవణంపల్లె: మండలంలో పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 13వ తేదీన తవణంపల్లె పోలీస్ స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.క్రిష్ణకుమార్ ఆధ్వర్యంలో వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 10 గంటలకు నిర్ణయించిన రుసుం చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?

- నీటి తొట్టె ఎవరి కోసం నిర్మించారు?
- అధికారుల తీరుపై ఆగ్రహించిన తల్లిదండ్రులు



చిప్పిలివారిపల్లెలో స్కూల్ ఆవరణలో నిర్మించిన నీటి తొట్టె

చౌడేపల్లె: పశువులకు, జీవరాశులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఉద్దేశించిన నీటి తొట్టెల నిర్మాణం ప్రమాదాలకు తావిచ్చేలా ఉంటున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు..మండలంలోని పెద్దయల్లకుంట్ల పంచాయతీ చిప్పిలివారిపల్లెలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో తరగతి గది పక్కనే నీటి తొట్టె నిర్మించారు. మధ్యాహ్న భోజనం సమయంలో ప్లేట్లు, చేతులు శుభ్రపరుచుకునే సమయంలో లేదా ఆడుకునే సమయంలో అక్కడ విద్యార్థులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటోంది. నిబంధనలు పక్కనపెట్టి ఎక్కడ బడితే అక్కడ కూటమి నేతలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో వీటిని నిర్మిస్తున్నారని పిల్లల తల్లిదండ్రులు మండిపడ్డారు. ప్రమాదాలు జరిగితే జిల్లా డ్వామా అధికారులు, మండల స్థాయి అధికారులు, కాంట్రాక్టర్ బాధ్యత వహిస్తారా? అని ప్రశ్నిస్తున్నారు.

దళితుల శ్మశానవాటిక ఆక్రమణపై సర్వే

సాక్షి ఎఫెక్ట్..



చిప్పిలివారిపల్లెలో దళితుల శ్మశాన వాటిక ఆక్రమిత ప్రాంతంలో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

చౌడేపల్లె: దళితుల శ్మశానవాటిక స్థలాన్ని అర్ధరాత్రి వేళ ట్రాక్టర్‌తో దున్ని ఆక్రమించిన ప్రాంతాన్ని సోమవారం వీఆర్వో రెడ్డెప్ప, సర్వేయర్ గుణశేఖర్ పరిశీలించారు. సాక్షిలో ఈనెల 4న దళితుల శ్మశానవాటిక (ఒలికిలగడ్డ)ఆక్రమణపై ప్రచురించిన కథనంపై తహసీల్దార్ హనుమంతు నాయక్ స్పందించారు. ఆయన ఆదేశాల రెవెన్యూ ఉద్యోగులు స్థలాన్ని పరిశీలించారు. సర్వే నంబరు 248/3 లో 66 సెంట్ల స్థలంలో పూర్వీకుల నుంచి ఒలికిల గడ్డగా పిలిచే ఈ ప్రాంతంలో మృతదేహాలను ఖననం చేసేవారని గ్రామస్తులు వారికి చెప్పారు. రికార్డుల ఆధారంగా సర్వే చేశారు. ఆక్రమణదారుడైన చిప్పిలి రెడ్డెప్పతోపాటు గ్రామస్తుల నుంచి వేర్వేరుగా స్టేట్‌మెంట్లను రికార్డుచేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వారు చెప్పారు.

దర్గాకు ఛాదర్ సమర్పించిన మాజీ ఎమ్మెల్యే



దర్గాలో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పట్టణంలోని దండపల్లె రోడ్డులోని గంజేషావలి దర్గా వద్ద ఉరుసు మహోత్సవంలో స్థానిక వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ వెంకటేగౌడ ఆదివారం రాత్రి పాల్గొన్నారు. ఆయన ఛాదర్ తలపై మోసుకొని దర్గా నిర్వాహకులకు సమర్పించారు. ప్రార్థనల అనంతరం ఆయన్ను దర్గా కమిటీ ఘనంగా సన్మానించింది. ఆపై అక్కడ ఖవ్వాలీలో కళాకారుల కార్యక్రమాన్ని వీక్షించారు. ఇలాంటి కార్యక్రమాలు భక్తి భావన పెరిగి మంచి ఆలోచనలతో జీవించడానికి దోహదం చేస్తాయని ఆయన అన్నారు. ఆయన వెంట పట్టణానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకులు, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శేషవాహనంపై మృత్యుంజయేశ్వరుడి కటాక్షం



శేషవాహనంపై ఊరేగుతున్న మృత్యుంజయేశ్వరుడు

చౌడేపల్లె: స్థానిక బజారు వీధిలోని శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా 4వ రోజైన సోమవారం ఉత్సవమూర్తులు శేషవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత అర్చకులు రాజశేఖర, దీక్షితులు, కుమారస్వామి శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించి శేషవాహనంపై కొలువు దీర్చారు. అనంతరం మేళతాళాల హోరు, శివ నామస్మరణల నడుమ పురవీధుల్లో విహరించారు. ఇంటింటా కర్పూర నీరాజనాలు అందుకున్నారు.ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా ఆర్యవైశ్యులు వ్యవహరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

డమ్మీ ఎమ్మెల్యేని కాదు..

చిత్తూరు అర్బన్: 'గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తిని పక్కనపెట్టి కొందరు అధికారాన్ని చెలాయించారుగానీ చిత్తూరులో ఇప్పుడా పరిస్థితి లేదు. నేను డమ్మీ ఎమ్మెల్యే కాదు.. చాలా పవర్ ఫుల్' అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని టీడీపీలో తానే కీలకమని మిగిలిన వాళ్ల ప్రమేయం ఏమీ ఉండదని స్పష్టం చేశారు. దీంతో ఎమ్మెల్యే పక్కనే కూర్చున్న సీనియర్ నేతల ముఖ కవళికలు మారిపోయాయి. ఇటీవల పలు పత్రికల్లో కట్టమంచి చెరువు పూడిక పనుల్లో అవినీతి చోటు చేసుకుందంటూ కథనాలు వెలుపడ్డాయి. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ కండలేరు నీటిని చిత్తూరుకు తీసుకువచ్చి చెరువులో నింపడానికి పూడికలు తీస్తున్నామని, దీనికోసం కలెక్టర్ సైతం నిధులు మంజూరు చేశారన్నారు. కలెక్టర్ అనుమతితోనే తవ్వకాలు జరుపుతున్నట్లు తెలిపారు. ఇక కట్టమంచి చెరువులో తాము పనులు చేయబోమని వైఎస్సార్‌సీపీ నాయకులు ఇక్కడ స్వచ్ఛందంగా పనులు చేయొచ్చన్నారు. తాను చిత్తూరు అభివృద్ధికి పాటు పడుతుంటే కొందరు రాజకీయాలు చేస్తూ ప్రతి పనినీ అడ్డుకుంటున్నారని దీనికి త్వరలోనే సమాధానం చెబుతానన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలను వెలికి తీస్తానని పేర్కొన్నారు. ఇక చెరువులో ఎవరైనా మట్టి తీసుకోవచ్చని పేర్కొన్నారు. పాత బస్టాండులో కాంప్లెక్స్ భవనం నిర్మించి తీరుతామన్నారు. హైరోడ్డు విస్తరణలో భాగంగా టీడీఆర్ బాండ్లు ఇచ్చేలా చూస్తామన్నారు. ఈ సమావేశంలో చూడా చైర్‌పర్సన్ హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నాయకులు చంద్రప్రకాష్, వసంత కుమార్, సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.